క్లుప్తంగా

క్రికెట్ కిట్ పంపిణీ



యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్

పోలవరం రూరల్ : యువత విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. పోలవరంలోని యువకులకు ఆయన క్రికెట్ కిట్‌ను ఆదివారం అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, పెద్దలను గౌరవించాలన్నారు. చెడు వ్యసనాలకు లోనుకాకూడదని, మంచి నడవడికతో భవిష్యత్తులో తల్లితండ్రులకు గౌరవం తీసుకురావాలన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు సన్మానం



సన్మానం పొందుతున్న కొయ్యలగూడెం జోన్ వాకర్స్ క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం : ఏలూరు వైఎంహెచ్ఏ హాల్‌లో నిర్వహించిన వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రెండవ క్యాబినెట్ మీటింగ్‌లో కొయ్యలగూడెం జోన్ వాకర్స్ క్లబ్ సభ్యులను సన్మానించారు. వాకర్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న అవగాహన కార్యక్రమాలకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ అవార్డుతో వారిని సన్మానించారు. తనతో పాటుగా క్లబ్ డైరెక్టర్ మాదేటి సత్యనారాయణ, నల్లజర్ల వాకర్స్ క్లబ్ అధ్యక్షులు చల్లా శ్రీనివాసరావు, కొయ్యలగూడెం క్లబ్ ప్రెసిడెంట్ గడ్డం రాంబాబు, ఎల్.మోహన్‌లను సన్మానించినట్లు జోన్ చైర్మన్ ఎస్‌బీజీ శేఖర్ ఆదివారం పేర్కొన్నారు.

మానవత ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు తీవ్ర గాయాలై, ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న తడికలపూడి గ్రామం రెడ్డిలు కాలనీకి చెందిన కొల్లి అప్పాయ్యమ్మకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంస్థ తరఫున కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ డైరెక్టర్లు గంగాధర్ ప్రసాద్, నల్లురి కాంతారావు, కోలా శ్రీనివాస్, నేక్కలపూడి సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం : కోడిపందేలపై ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన

దెందులూరు: మండలంలో ఆదివారం సాయంత్రం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ పరిశీలించారు. ఉంగ్రాజావరం, పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నష్టపోయిన పొలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెర్టిలైజర్ బూస్టర్ డోసు, యూరియా 20 కేజీలు, ఎంఓపీ 20 కేజీలు, ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు. 225 ఎకరాలు ముంపునకు గురైందని వీటిలో కొంతమేర మాత్రమే పాక్షికంగా నష్టవాటిల్లిందని అసిస్టెంట్ డైరెక్టర్‌కు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ వివరించారు.

క్రికెట్ పోటీల విజేత బ్లూ జట్టు

ఉంగుటూరు: క్రికెట్ పోటీలు యువతకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని పుప్పాల కార్తీక్ అన్నారు. ఆదివారం నారాయణపురంలో ముగిసిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఆయన పంపిణీ చేశారు. విజేతగా నిలిచిన బ్లూ టీముకు షీల్డుతోపాటు రూ.20 వేల నగదు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన కిల్లర్స్ జట్టుకు షీల్డుతోపాటు రూ.15 వేల నగదు అందజేశారు. ఈ పోటీలను పుప్పాల కార్తీక్ పర్యవేక్షణలో బంకు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, హరివిల్లి మహాలక్ష్మి, దానయ్య, వార్డు సభ్యుడు నేదూరి గంగాధర్‌రావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, మతుకుమిల్లి శ్రీధర్, పైడి వరప్రసాదు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మెదటి బహుమతి నగదును ఐస్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు పొత్తూరి శ్రీనివాసరాజు స్పాన్సర్ చేశారు. రెండో బహుమతి షీల్డ్, నగదును ఆర్గనైజర్లు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో నిర్వాహకులతోపాటు పుప్పాల కార్తీక్, పొత్తూరి శ్రీనివాసరాజు, ఉప సర్పంచి అడపాశ్రీను, సీపాని బాలు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- రామయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని నాగులగూడెం పంచాయతీ రామయ్యపేట కాలనీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ.. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో ఆరా తీస్తూ ఇంకా ప్రజల సమస్యలపై తెలుసుకుంటున్నామని అన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పని తీరుపై ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందకుండా అడ్డుకునే ప్రయత్నాలు ప్రతిపక్షాలు ఎన్ని చేసినా సీఎం వైఎస్ జగన్ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అధిక స్థానాల్లో గెలుపొంది ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఎమ్మెల్యే ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, సర్పంచ్‌లు గుబ్బల సత్యవేణి, యరమాల సత్యవతి, కోట వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గంజి వినోద్, సాయిల స్వాతి, నిట్టా బాలయ్య, ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వర్కర్స్ టీం ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట : గుండె మార్పిడి అవసరమైన ఓ వ్యక్తికి సోషల్ వర్కర్స్ టీం సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. తడికలపూడి గ్రామానికి చెందిన మాడపాటి గణేష్ బాబుకు హైదరాబాదులోని కేర్ ఆస్పత్రి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి గుండె మార్పిడి చేయాలని నిర్ధారించారు. ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్న అతని ఆర్థిక పరిస్థితి తెలిసి దాతల నుంచి విరాళాలు సేకరించి సోషల్ వర్కర్స్ టీం సభ్యులు రూ.25 వేలు అందజేశారు. ఈసందర్భంగా టీం సభ్యులు వీరమల్ల మధు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన వరల్డ్ టాప్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్ కుమార్, పేషెంట్ సేవ హెల్పర్ ఆరోగ్యశ్రీ రాజా ప్రత్యేక దృష్టి సారించి గణేష్ బాబు వైద్య పరీక్షల నిమిత్తం గుండె మార్పిడి నిమిత్తం ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. గుండె మార్పిడికి ముందు స్కానింగ్ పరీక్షల నిమిత్తం రూ.4 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని దాతల నుంచి సహాయాన్ని కోరుతున్నట్లు మధు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు మేరువ వేణు, పెద్దింటి చంటి పాల్గొన్నారు.

అచ్చియ్యపాలెంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని అచ్చియ్యపాలెంలో ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ పాడియం సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ తెల్లం గంగారావు, డాక్టర్ కొమరం భాను వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్యసేవలు అందించామని చెప్పారు. గ్రామంలో అనారోగ్య సమస్యలను తెలుసుకుని ఈ ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తామా దివ్య, తామా మంగరాజు, తెల్లం గంగాదేవి, పూనెం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సభ



సభలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

చింతలపూడి : విద్యారంగంలో ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంతో పాటు 117 జీఓను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎం హోటల్ కళ్యాణ మండపంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక పరమైన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎం.శామ్యూల్, జిల్లా అధ్యక్షులు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్, బాబు, సుధాకర్, కొండ జేమ్స్, జనార్దన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక కార్యవర్గం నియామకం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండల, పట్టణ గవర్నమెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ తాత్కాలిక కార్యవర్గ కమిటీని నియమించారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలోని అసోసియేషన్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు తాత్కాలిక కమిటీని నియమించారు. సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ 2023–2024 సంవత్సరానికి సంబంధించి నూతన జనరల్ బాడీ నియామకం జరిగే వరకు తాత్కాలిక కమిటీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా బి.రాంబాబు, పి.గవరయ్య, పి.రామమోహన్‌రావు, ప్రెసిడెంట్ ఎం.రాజా శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఎస్‌కే.దాదా, జాయింట్ సెక్రటరీ వి.రామమోహన్‌రావు, ట్రెజరర్‌గా టి.శ్రీనివాసరావులను నియమించినట్లు చెప్పారు.

కాపు విద్యార్థులకు పతకాల అందజేత

ఏలూరు (టూటౌన్): కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో 100 మంది ఉత్తమ ప్రతిభ గల కాపు విద్యార్థులకు రజిత పతకాలను అందజేశారు. ఆదివారం నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు మాట్లాడుతూ 10వ తరగతిలో 500కు పైగా, ఇంటర్‌లో 900కు పైగా మర్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. తొలుత కాపు సంక్షేమ సేన మహిళా అధ్యక్షురాలు మామిడిపల్లి కృష్ణ కుమారి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నారా శేషు, పాలి ప్రసాద్, పూజారి నిరంజన్, శిరిపల్లి ప్రసాద్, చోడగిరి శ్రీనివాస్, ఆర్.హరినాథ్, శాయన దాశరధి, నందేటి ఆది సురేష్, పోలూరి హరినాథ్, కానాల రామకృష్ణ విద్యార్థులకు పతకాలను అందజేశారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గం సభ్యులు

పోలవరం రూరల్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పోలవరం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. పోలవరం మండలానికి దాతలు అందించిన ఫ్రీజర్‌ను మానవత జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు ఆధ్వర్యంలో అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఫ్రీజర్‌ను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు సంస్థ చేపట్టే కార్యక్రమాలపై తెలియజేశారు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మానవత సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం అని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవల్లో పాలు పంచుకోవాలని తెలిపారు. రూ. 25 వేలతో సంస్థలో శాశ్వత సభ్యత్వాన్ని కె.భద్రకాళీ, జీజీఆర్‌సీహెచ్ శేఖర్‌బాబు, కె.రాంబాబు సభ్యత్వం పొందారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జీజీఆర్‌సీహెచ్ శేఖర్‌బాబు, కార్యదర్శి కె.రాంబాబు, కోశాధికారిగా ఎస్.నారాయణ, ఉపాధ్యక్షులు పి.పోసిబాబు, ఈసీ మెంబర్స్‌గా ఎస్.వెంకటేశ్వరరావు, జె.చంద్రశేఖర్, బి.అప్పాజీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లుగా కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకా రాంబాబు, ఆకుల నరసింహమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నియంత్రణా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, క్లస్టర్ కన్వీనర్ బి.చంద్రయ్య, కొణతాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార సదస్సులు విజయవంతం



కొయ్యలగూడెంలో జగనన్న సురక్షలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది (ఫైల్)

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నిర్వహించిన సమావేశాల్లో ఐసీడీఎస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార సదస్సులు విజయవంతం అయ్యాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి యు.స్వర్ణకుమారి పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని కొయ్యలగూడెం, పోలవరం మండలాలు ఉండగా రెండు మండలాల్లో కలిపి 38 చోట్ల స్టాల్స్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ కార్యకర్తల సమన్వయంతో స్టాల్స్‌ని ఏర్పాటు చేసి ప్రజలకు గర్భిణులకు, బాలింతలకు చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అయితే ఐసీడీఎస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసే పౌష్టికాహార ప్రదర్శన కంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాలలో ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకోగలిగారన్నారు. 36 రకాల ఆట వస్తువులను ప్రదర్శనలో ఉంచడంతోపాటు మిషన్ వాత్సల్య పథకంలోని అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరిగింది అన్నారు. 11 రకాల పౌష్టికాహారాలను స్టాల్స్‌లలో ప్రదర్శనకు ఉంచడం జరిగిందని ప్రజాప్రతినిధులు సైతం పౌష్టికాహార పంపిణీ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేశారని సూపర్‌వైజర్ ఎ.నయోమిరాణి పేర్కొన్నారు. స్టాల్స్‌లను విజయవంతం చేయడంలో కృషి చేసిన కార్యకర్తలను సిబ్బందికి అధికారులు అభినందించారు.

వరద పరిస్థితిని పరిశీలించిన తహసీల్దార్

పోలవరం రూరల్ : పోలవరంలో గోదావరి వరద పరిస్థితిని తహసీల్దార్ బి.సుమతి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పోలవరం నుంచి గూటాల వరకు ఏటిగట్టు పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే నెక్లెస్ బండ్ గట్టును పరిశీలించి అధికారులతో చర్చించారు. వరద పెరిగినప్పటికీ ఎటువంటి ఇబ్బంది లేదని తహసీల్దార్ పేర్కొన్నారు.

102 మందికి దంత వైద్యసేవలు



వైద్యపరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సూర్య దంతవైద్యశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ శివరామ్‌కుమార్ వైద్యసేవలు అందించారు. సుమారు 102 మంది ఈ వైద్య శిబిరానికి హాజరైనట్లు బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వీరికి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కె.కోటేశ్వరరావు, డి.కేదారేశ్వరరెడ్డి, బి.సత్యనారాయణ, ఆర్.భాస్కరరావు, సిబ్బంది, ఆసుపత్రి వైద్యసిబ్బంది, మెడిల్యాబ్స్ దేవమస్తాన్, అస్త పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కేరళ సిస్టర్ ఎల్సీ మృతి

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం యూపీ పాఠశాలలో టీచర్‌గా పనిచేసిన కేరళ రాష్ట్రానికి చెందిన సిస్టర్ ఎల్సీ (76)శనివారం గుండెపోటుతో పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లోని సిస్టర్స్ హోంలో మృతి చెందారు. 25 ఏళ్లుగా ఆంధ్రా ప్రాంతానికి వచ్చి పలు మిషనరీ సంస్థల్లో ఉపాధ్యాయురాలుగా, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సేవకురాలుగా, ఆధ్యాత్మిక అభివృద్ధికి విశేష సేవలందించారు. ఆమె మృతి పట్ల ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు, ప్రావిన్షియల్ సుపీరియర్ లీజా సెబస్టియన్, అసిస్టెంట్ ప్రావిన్షియల్ మరీథెరిజ్, వికార్ జనరల్ ఫాదర్ డాక్టర్ బాల, సెయింట్ జాన్స్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ జీ. మోజెస్, దెందులూరు ఆర్‌సీఎం యూపీ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ టీనామరియా, దెందులూరు ఫాదర్ జీ. అమ్మన్‌రాజా సంతాపం తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె సేవలను కొనియాడారు.

మణిపూర్ ఘటనపై క్రైస్తవుల ఆందోళన



రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



పోలవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై, పిల్లలుపై, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా రాజవరం గ్రామం బెతస్తా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. దోషులను వెంటనే శిక్షించాలనీ, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బెతస్తా ప్రార్థన మందిరం సంఘ కాపరి కె.జాకోబ్, కె విజయ్ దేవరాజుతో కలిసి సంఘ పెద్దలు యువకులు, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, తమ్మిర్సి బ్రహ్మయ్య, యండపల్లి డీలరాజ్, శ్రీకాకుళపు ఏసుబాబు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సింహాద్రి భాస్కర్, పేట సప్తగిరి బాబు, పల్లంట్ల యోహాన్, ఏలేటి రాజు, ర్యాల బెన్యామిన్, తమ్మిర్సి శ్రీను, భీమడోలు పెద్ద దుర్గారావు, మిరియాల రమణయ్య, యండపల్లి విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో శాంతి ర్యాలీ

పోలవరం రూరల్ : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై, ప్రజలపై దాడులు అమానవీయం అని పాస్టర్ పీజే సుధాకర్, ఎ.డేవిడ్ రాజు అన్నారు. పోలవరంలో ఆదివారం పాస్టర్‌లు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా తిరుగుతూ స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం చేశారు. మణిపూర్‌లో అల్లర్లకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అమాయకులైన గిరిజనులను హత్యచేయడంతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రలు లేకుండా చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.జయరాజు, కె.శామ్యుల్‌రాజు, డి.ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొంటాం

- సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్
- వరద ముంపు గ్రామాల్లో పర్యటన



కొత్తూరులో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

వేలేరుపాడు : గోదావరి వరద వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా అధికార యంత్రాంగం ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆదివారం వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన రుద్రమకోట, కన్నాయిగుట్ట, తిర్లాపురం, తాట్కూరుగొమ్ము, తూర్పుమెట్ట, కొత్తూరు, ముంపు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద బాధితులకు ఇబ్బందులు కలుగకుండా చూడటమే తమ కర్తవ్యమన్నారు. వరదల కారణంగా సురక్షిత ప్రాంతాలకు రాలేని వారు గుట్టలపైనే ఉంటున్నారని, వారికి సహాయక కార్యక్రమాలను వారి వద్దకే అందిస్తున్నామని సబ్ కలెక్టర్ చెప్పారు. వరద నీరు కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు బోట్‌ల ద్వారా అధికారులు రోజుకు రెండు సార్లు వెళ్లి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలను కూడా బోట్‌ల ద్వారా అందిస్తున్నామన్నారు. ఆయా గ్రామాలలో వీఆర్‌వో, ఏఎస్ఎం, రెండు సచివాయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలు తమ సమస్యలను కంట్రోల్ రూమ్‌కి తెలియజేస్తున్నారని, వాటిని రెవెన్యూ సిబ్బంది పరిష్కరిస్తున్నారన్నారు. కొండ ప్రాంతాలలోని ప్రజలు కొవ్వొత్తులు, దోమతెరలు కోరారని, వాటిని కూడా వారికి అందిస్తున్నామని అన్నారు. తాగునీటికి ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక అంబులెన్సు బోట్‌ను, జనరేటర్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వేలేరుపాడు మండలంలోని 35 నివాసిత ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. కొయిదాలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన సందర్శించి, అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, మందుల నిల్వలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ చల్లన్న దొర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు భరోసా



ఎడవల్లిలో నీటమునిగిన ఇండ్లు



రుద్రమకోటలో చేరువలోని గుట్టపై నివాసముంటున్న గ్రామస్తులు



ఎన్‌డీఆర్ఎఫ్‌బోట్‌లో రుద్రమకోట వెళ్తున్న ఎమ్మెల్యే బాలరాజు

వరద ముంపునకు గురైన రుద్రమకోట గ్రామంలో ఆదివారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన గురించి వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. - వేలేరుపాడు

ఉన్నతాధికారుల దృష్టికి డ్రెయినేజీల సమస్య

పెదపాడు: డ్రెయినేజీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఏలూరు ఏడీఏ వై సుబ్బారావు తెలిపారు. పెదపాడు మండలంలోని ఖాజీగూడెం, సకలకొత్తపల్లి, సత్యవోలు వీరభద్రపురంలో ఆదివారం పర్యటించారు. ఈకార్యక్రమంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. డ్రెయినేజీల సమస్యలపై జిల్లా కలెక్టరు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.